క్లుప్తంగా

ఉచిత వైద్యపరీక్షలు



గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు వైద్య శిబిరంలో ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ సి.ఎల్.వెంకట్రావు ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య పరీక్షలు చేశారు. గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఆరోగ్య సమస్యలున్న రోగులకు డాక్టర్ సి.ఎల్.వెంకట్రావు, దంత సమస్యలకు ఏలూరు సెయింట్ జోసఫ్ డెంటల్ వైద్యులు, గుండె సంబంధ వ్యాధులకు విజయవాడ సీవీఆర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు తమ వైద్య సేవలను అందించారు.

అన్నసమారాధనకు రూ. 1.02 లక్షలు



గుడివాడ టౌన్: స్థానిక జగన్నాథపురం పాటి మీద వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం శనివారం అన్నసమారాధనకు భక్తులు రూ.1,02,100 ఇచ్చినట్లు ఆలయ ఈఓ కె. వేణుగోపాలరావు తెలిపారు. ఈ మొత్తాలను బ్యాంకులో డిపాజిట్ చేసి వచ్చిన వడ్డీ ద్వారా ప్రతి శనివారం ఆలయంలో నిర్వహిస్తున్న అన్నసమారాధన కార్యక్రమాలకు వినియోగిస్తామని తెలిపారు. పట్టణానికి చెందిన వీర్ల శ్రీరామ్ యాదవ్ – సీతామహాలక్ష్మి కుమారుడు బాల సాయిసుబ్రహ్మణ్యం చెక్కు ద్వారా అందజేశారన్నారు.

గ్రంథ పఠనంతో విజ్ఞానం

పమిడిముక్కల: గ్రంథ పఠనంతో విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని విశ్రాంత ప్రొఫెసర్ కాపూరి సూర్యప్రకాశరావు తెలిపారు. పమిడిముక్కల్లో నూతనంగా ఏర్పాటు చేసిన కాపూరి చలపతిరావు స్మారక గ్రంథాలయాన్ని శనివారం గ్రామ పెద్దలు కోనేరు నాగేశ్వరరావు, కోగంటి సత్యనారాయణ సూర్యప్రకాశరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సూర్యప్రకాశరావు మాట్లాడుతూ తమ కుటుంబమంతా కలిసి గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఖర్చంత తామే భరిస్తామని తెలిపారు. కాపూరి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ద్వారా పేద విద్యార్థుల చదువుకు ఆర్థిక సాయం చేస్తామని తెలిపారు.

పశువుల చావిడి, వరిగడ్డి దగ్ధం



పమిడిముక్కల: మండలంలోని గురజాడలో శనివారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో జరిగిన అగ్నిప్రమాదంలో కాండ్రు తిరుపతయ్యకు చెందిన పశువుల చావిడి, పక్కనే ఉన్న నాలుగు ఎకరాల వరిగడ్డి పూర్తిగా దగ్ధమయ్యాయి. చావిడిలోని నాలుగు గేదెలకు చర్మం కాలిపోయి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో రూ.5 లక్షల నష్టం వాటిల్లింది.

ఎమ్మెల్యే పరామర్శ..

సమాచారమందిన వెంటనే ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా గురజాడ వెళ్లి గాయాలైన గేదెలను, చావిడిని పరిశీలించారు. బాధితుడు తిరపతయ్యను పరామర్శించి నష్టం వివరాలు అడిగి తెలుసుకున్నారు. అధైర్యపడవద్దని, ఆదుకొంటామని హామీ ఇచ్చారు.

ఒరిజినల్ పట్టాలు ఎందుకు ఇవ్వరంటూ నిలదీత

మండవల్లి: 17 ఏళ్ల క్రితం స్థానిక తరుగుమూలన ఇచ్చిన స్థలాలకు ఒరిజినల్ పట్టాలు ఎందుకివ్వరని ఐక్యవేదిక ప్రతినిధులు భాస్కరరావు, అప్పారావు, రంగారావు, వెంకటేశ్వరరావు గ్రామసభలో ప్రశ్నించారు. మండవల్లి నాగసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద సర్పంచ్ మెండా ఝాన్సీ అధ్యక్షతన శనివారం గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా ఐక్యవేదిక ప్రతినిధులు మాట్లాడుతూ గతంలో ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ఒరిజినల్ పట్టాలు లబ్ధిదారులకు అందించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు చెప్పారని, అయితే ఇప్పటివరకు అందించలేదన్నారు. మాజీ సర్పంచ్ చిట్టిబాబు, ఉప సర్పంచ్ నాగలక్ష్మి పాల్గొన్నారు.

ఉప్పలమ్మను దర్శించుకున్న సినీ నిర్మాత



గుడ్లవల్లేరు: స్థానిక ఉప్పలమ్మ తల్లి అమ్మవారిని చిరంజీవి ప్రొడక్షన్ అధినేత, సినీ నిర్మాత చల్లపల్లి అమరప్రసాద్ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ నిర్వాహకులు ఆంజనేయులు, మహాలక్ష్మి దంపతులు అమ్మవారి ప్రసాదాలను అందించారు.

గుంతలమయం.. గుండెల్లో భయం

అధ్వానంగా మారిన రోడ్లు

కైకలూరు నియోజకవర్గంలో రోడ్లు గుంతలమయంగా మారాయి. ఈ రోడ్లలో ప్రయాణించాలంటే వాహనచోదకుల గుండెల్లో దడ పుడుతోంది. అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంతో ప్రమాదాలబారిన పడుతున్నామని ద్విచక్రవాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ముదినేపల్లి మండలం వడాలి సెంటర్‌లో రోడ్డుపై ప్రమాదకరంగా మారిన గుంత

కైకలూరు: బుడమేరు వరద ప్రభావం కైకలూరు నియోజకవర్గంలో కొల్లేరు గ్రామాలను ముంచెత్తింది. దీని పరివాహక గ్రామ రహదారులన్నీ నెల రోజులు పాటు నీటిలో నానాయి. పడవలపైనే ప్రజలు ప్రయాణాలను సాగించారు. మరోవైపు అధికారుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధుల పర్యవేక్షణ లోపంతో నియోజకవర్గంలో పలు డ్రెయిన్లు సైతం పొంగిపొర్లాయి. డ్రెయిన్ల నీరు రోడ్లను ముంచెత్తడంతో వారాల తరబడి రాకపోకలు బంద య్యాయి. వరదల నుంచి తేరుకున్నప్పటికీ రహదారులకు మరమ్మతులు చేయకపోవడంతో వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు.

దెబ్బతిన్న రోడ్లు

కైకలూరు మండలంలో ఆలపాడు నుంచి కొల్లేటికోట వరకు రహదారి గుంతల మయంగా మారింది. సమీప కొల్లేరు గ్రామాల పరిస్థితి ఇదేవిధంగా ఉంది. గోకర్ణపురం నుంచి పైడిచింతపాడు మీదుగా ఏలూరు చేరే రహదారిలో మూడు ప్రాంతాల్లో వరదలతో గుంతలు ఏర్పడంతో ప్రయాణాలు నిలిచాయి. బడి బస్సులు సైతం వెళ్లడం లేదు. ఆటపాక నుంచి వరహాపట్నం చేరే రహదారి అధ్వానంగా మారింది. కలిదిండి మండలంలో మద్వానిగూడెం – పెదలంక, సంతోషపురం–మూలలంక, చినతాడినాడ వయా పోతుమర్రు–కలిదిండి రోడ్లు, మండవల్లి మండలంలో పెదఎడ్లగాడి–పెనుమాకలంక రోడ్డు, నందిగామలంక, పులపర్రు, కొవ్వాడలంక, నుచ్చిమిల్లి, తక్కెళ్లపాడు, ఉనికిలి, సుబ్బారావుపేట రోడ్లు దెబ్బతిన్నాయి. ముదినేపల్లి మండలంలో ముదినేపల్లి– గుడ్లవల్లేరు, ముదినేపల్లి–వడాలి, తామరకొల్లు–వడాలి, సింగరాయపాలెం–కోరుకొల్లు రహదారులు అధ్వానంగా మారాయి.



కైకలూరు మండలం ఆటపాక నుంచి వరహాపట్నం వెళ్లే రహదారిలో అగ్రహారం వద్ద దెబ్బతిన్న రోడ్డు



ముదినేపల్లి మండలం వడాలి సెంటర్‌లో ప్రయాణికుల పాలిట శాపంగా మారిన రోడ్డు

ఆక్వారంగంతోనే అసలు సమస్య..

నియోజకవర్గంలో 86 గ్రామాల్లో సుమారు 75 వేల ఎకరాల్లో చేపల, రొయ్యల చెరువులు సాగవుతున్నాయి. చెరువుల అడుగుభాగంలో నీటి ఊట రోడ్ల కిందకు చేరడంతో రోడ్లు పాడవుతున్నాయి. ప్రతిరోజు వందల లారీల ఆక్వా ఉత్పత్తులు ఈ ప్రాంతం నుంచి ఇతర రాష్ట్రాలకు రవాణా చేస్తున్నారు. రోడ్లపై పరిమితికి మించి అధిక బరువుతో లారీలు, వ్యాన్‌లు వెళ్లడంతో రహదారులు గుంతలమయంగా మారుతున్నాయి.

జాతీయ రహదారి కూడా..

పామర్రు నుంచి పాలకొల్లు సమీపంలో దిగమర్రు వరకు జాతీయ రహదారి (నంబరు 165) మొత్తం 107 కిలోమీటర్లు విస్తరించి ఉంది. కైకలూరు నియోజకవర్గంలో ముదినేపల్లి, మండవల్లి, కైకలూరు మండలాల మీదుగా ఇది వెళుతోంది. ప్రధానంగా మండవల్లి సెంటర్‌లో జాతీయ రహదారి దెబ్బతింది. అదేవిధంగా కైకలూరు నుంచి ఆలపాడు వరకు అనేక చోట్ల గుంతలు పడ్డాయి. ఇదే కాకుండా కైకలూరు–ఏలూరు రహదారిలో ఇటీవల వరదలకు అనేక ప్రాంతాల్లో గుంతలు పడ్డాయి. అనేకమంది వాహనదారులు రాత్రి సమయంలో ప్రమాదాలబారిన పడుతున్నారు. కనీసం పడిన గుంతలకు అధికారులు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



మండవల్లి ప్రధాన జాతీయ రహదారిపై అడుగుకో గుంతగా మారిన దృశ్యం

రోడ్లను త్వరగా బాగుచేయాలి



ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు మరింతగా దెబ్బతిన్నాయి. పలు రహదారుల్లో అనేక మంది ద్విచక్రవాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. దెబ్బతిన్న రోడ్లను త్వరగా బాగుచేయాలి. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ రహదారుల అభివృద్ధి జరగలేదు. ప్రభుత్వం దృష్టి సారించాలి.

– మంగినేని బాబ్జి, సింగరాయపాలెం, ముదినేపల్లి మండలం

నరకప్రాయంగా రహదారులు



కూటమి అధికారంలోకి వచ్చి 100 రోజులు దాటినా ఇప్పటివరకు చేసిందేమీ లేదు. ఇటీవల వర్షాలకు గ్రామీణ రహదారులు దెబ్బతిన్నాయి. కలిదిండి పంచాయతీలో పలు రహదారులు గుంతలమయంగా మారాయి. ఇప్పటికైనా అధికారులు రహదారులకు మరమ్మతులు చేయాలి.

– షేక్ చాన్ బాషా, వక్ఫ్‌బోర్డు జిల్లా డైరెక్టర్, కలిదిండి

నివేదిక ఉన్నతాధికారులకు పంపాం

నియోజకవర్గంలో రహదారుల మరమ్మతులకు సంబంధించి నివేదికను ఉన్నతాధికారులకు పంపాం. టెండర్లు కూడా పూర్తయ్యాయి. త్వరలోనే మరమ్మతు పనులు చేపడతాం.

– భాస్కర్, ఆర్‌అండ్‌బీ జేఈ,కైకలూరు

ఉన్నత లక్ష్య సాధనకు కృషి



ఉత్తమ ర్యాంక్ సాధించిన విద్యార్థినికి ప్రోత్సాహక బహుమతి అందజేస్తున్న సీఐ శ్రీనివాస్

గుడివాడరూరల్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించుకునేవిధంగా ముందుకు సాగాలని గుడివాడ వన్‌టౌన్ సీఐ కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక వీకేఆర్ వీఎన్‌బీ ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో గుడివాడ శ్రీచైతన్య కళాశాల కల్చరల్ ఫెస్ట్ కార్యక్రమం శనివారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఐ మాట్లాడుతూ సమాజంలో విద్యతోనే అన్ని సాధ్యమవుతాయని విద్యార్థులు గుర్తించుకోవాలన్నారు. అందుకు అనుగుణంగా కష్టపడి జీవితంలో ఉన్నతమైనటువంటి స్థితిలో నిలబడాలని ఆకాంక్షించారు. ఉత్తమ ర్యాంక్‌లు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకంతో పాటు బహుమతులను సీఐ అందజేశారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

ప్రజలు ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి



నూతన వినాయక విగ్రహం వద్ద పూజలు చేస్తున్న డీఎన్నార్

కలిదిండి (కైకలూరు): ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకుని సుఖజీవనం కొనసాగించాలని వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) పేర్కొన్నారు. కోరుకొల్లు ఎంబీ కాలనీలో వరసిద్ధ వినాయక స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో శనివారం ఆయన పాల్గొన్నారు. వినాయకుని ఆశీస్సులు ప్రజలందరిపై ప్రసరించాలని ప్రార్థించారు. కార్యక్రమంలో చన్నంశెట్టి సుబ్రహ్మణ్యం, గ్రామ పార్టీ అధ్యక్షుడు చన్నంశెటి సోమేశ్వరరావు, నాయకులు నరసయ్య, వెంకటరాజు, వీరుల్లు, మాతరావు, సత్యనారాయణ, లక్ష్మి, నరహరి, మురళీకృష్ణ, గణేష్, శివ, వెంకటనాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్న్‌షిప్‌పై విద్యార్థులకు అవగాహన

ముదినేపల్లి రూరల్: స్థానిక జెడ్పీహైస్కూల్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాంపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో పీఎం ఇంటర్న్‌షిప్ పథకాన్ని ప్రారంభించారు. దీనిపై హైస్కూల్ విద్యార్థులకు సమగ్రశిక్షా ఆధ్వర్యంలో ఇంటర్న్‌షిప్ ప్రాధాన్యంపై ఒకేషనల్ కోఆర్డినేటర్ పి.సాయిరాం, శిక్షకుడు నాగమల్లేశ్వరరావు వివరించారు.

భక్తి భావాన్ని పెంపొందించుకోవాలి



జపమాల మాత మహోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కుమార్‌రాజా

కురుమద్దాలి(పామర్రు): ప్రతిఒక్కరూ భక్తి భావాన్నిపెంపొందించుకుంటే సమాజం సస్యశ్యామలంగా మారుతుందని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. మండలంలోని కురుమద్దాలి గ్రామంలో ఆర్‌సీఎం చర్చి వద్ద జపమాల మాత మహోత్సవం శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గోట్రు విజయభారతి, గ్రామ పార్టీ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, ఆర్‌సీఎం చర్చి నిర్వాహకులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు



విద్యుత్‌శాఖ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాము

గుడివాడరూరల్: నియోజకవర్గంలోని రైతులు, ప్రజలకు విద్యుత్ సమస్యలు లేకుండా ముందస్తుగానే అన్ని చర్యలు తీసుకోవాలని విద్యుత్‌శాఖ అధికారులకు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సూచించారు. విద్యుత్‌శాఖలో ఇటీవల బాధ్యతలు చేపట్టిన అధికారులతో ఏలూరురోడ్డులోని ప్రజావేదికలో ఎమ్మెల్యే రాము శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విద్యుత్‌శాఖ ఎస్‌ఈ సత్యానందం, డీఈ శ్రీనివాసరావు, ఏడీఈ గోరంట్ల గోవిందరావుతో ఎమ్మెల్యే పలు అంశాలపై సమీక్షించారు. ఇటీవల వరదల ప్రభావంతో దెబ్బతిన్న విద్యుత్ లైన్లు, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లకు పూర్తిస్థాయి మరమ్మతులు చేయించాలని అధికారులకు సూచించారు.

నాన్ ఆక్వాజోన్ చెరువులకు విద్యుత్ అందించండి

కైకలూరు: నాన్ ఆక్వాజోన్ పరిధిలో చేపల, రొయ్యల చెరువులకు విద్యుత్ సరఫరా చేయాలని కోరుతూ కలిదిండి ఇందిరా కాలనీకి చెందిన లివింగ్ ఫర్ సొసైటీ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ గోంద్రాల హనుమా అయ్యప్ప కోరారు. ఈ మేరకు శనివారం ఆయన ఏలూరులో మత్స్యశాఖ కార్యాలయంలో అధికారి రాజ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అయ్యప్ప మాట్లాడుతూ కలిదిండి మండలంలో లోడిదిలంక, గోపాలపురం, సానారుద్రవరం, వెంకటాపురం, కాళ్లపాలెం, కలిదిండి గ్రామాలు ఆక్వాజోన్ పరిధిలో లేవన్నారు. ఇక్కడ ఆక్వా రైతులకు విద్యుత్ అందించాలని కోరారు.

సంక్షిప్త వార్తలు

తోట్లవల్లూరు ఎంపీడీఓగా రవికాంత్

తోట్లవల్లూరు: తోట్లవల్లూరు ఎంపీడీఓగా కేఏఎస్ రవికాంత్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఏ.కొండూరు నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. తొలుత రవికాంత్‌కు కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు సాదర స్వాగతం పలికారు.

మొవ్వలో..

మొవ్వ: మొవ్వ మండల అభివృద్ధి అధికారిగా జే విమాదేవి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా ఆమె ఉయ్యూరు నుంచి మొవ్వ మండలానికి విచ్చేశారు. అదేవిధంగా ఈఓపీఆర్‌డీగా మాదివాడ కృష్ణపరమాత్మ బాధ్యతలు తీసుకున్నారు.

7 నుంచి శిక్షణ కార్యక్రమాలు

ముదినేపల్లి రూరల్: పంచాయతీలలో సాధారణ పరిపాలనా విధానం, పంచాయతీరాజ్ చట్టం నిబంధనలపై పంచాయతీల ఉపసర్పంచ్‌లు, వార్డుమెంబర్లకు ఈ నెల ఏడో తేదీనుంచి శిక్షణ కార్యక్రమాలు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తామని ఎంపీడీఓ రామకృష్ణ శనివారం తెలిపారు. ప్రతి పంచాయతీ నుంచి ఉపసర్పంచ్‌తో పాటు ఇద్దరు వార్డు మెంబర్లకు రెండు విడతలుగా శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు.

బ్యాంకుల సేవలపై అవగాహన

మండవల్లి: ప్రభుత్వ బ్యాంకుల సేవలపై కేంద్ర ప్రభుత్వ సామాజిక భద్రత పథకాల్లో అందరూ అవగాహన పెంచుకోవాలని వీరంకిలాకు సప్తగిరి గ్రామీణ బ్యాంకు అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ సుధాకర్ పేర్కొన్నారు. సప్తగిరి గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో అవార్డు కళాజాత బృందం సభ్యులు ప్రభుత్వం అందించే వివిధ పథకాలపై, ఇన్సూరెన్స్ స్కీంలపై అవగాహన కల్పించారు.

సభ్యత్వ నమోదు పరిశీలన

గుడ్లవల్లేరు: మండలంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పార్టీ జిల్లా ఇన్‌చార్జి కబర్థి శనివారం పరిశీలించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు అట్లూరి దిలీప్‌కుమార్, గుడివాడ నియోజకవర్గ ఇన్‌చార్జి సురేంద్రబాబు, మండల అధ్యక్షుడు వల్లమూడి నరేంద్ర పాల్గొన్నారు.

భక్తులకు అన్నసమారాధన

గుడ్లవల్లేరు: డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తుల తాకిడి అధికమైంది. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు అన్నసమారాధన కార్యక్రమాన్ని మెయిల్ ప్రతినిధి పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి దంపతుల శనివారం ప్రారంభించారు. మెయిల్ మేనేజింగ్ డైరెక్టర్ పురిటిపాటి వెంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆర్థిక సాయంతో జరిగిందని నిర్వాహకులు తెలిపారు.

ఉపాధ్యాయ వృత్తి ఉన్నతం

గుడ్లవల్లేరు: సమాజంలోని ఏ ప్రముఖ రంగానికైనా విద్యార్థులను అందించే ఉన్నతమైన వృత్తి ఉపాధ్యాయ వృత్తి అని జిల్లా లయన్స్ మాజీ చైర్మన్ వై.పి.సి.ప్రసాద్ అన్నారు. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యాన శనివారం స్థానిక లయన్స్ సేవాభవన్‌లో కలపాల రత్నం, ఎం.ఆరోగ్యం, సిహెచ్.శ్రీనివాస్, ఎం.స్రవంతిని ఘనంగా సన్మానించారు.

పామర్రులో..

పామర్రు: సమాజానికి దిక్సూచీ వంటి ఉపాధ్యాయులను సన్మానించుకోవడం అదృష్టంగా భావిస్తున్నామని పద్మశ్రీ ఘంటసాల కళాపీఠం అధ్యక్ష, కార్యదర్శులు కాటూరి వెంకటమురళీకృష్ణ, హేమంత్‌రెడ్డి అన్నారు. స్థానిక హితమ్ స్కూల్లో శనివారం ఉపాధ్యాయులు తులసి, రమేష్‌బాబు, అంకరవి, శ్రీనివాస్, లంక నరేంద్ర, ఉల్లి తనూజ, అరవపల్లి రావును సన్మానించారు. కళాపీఠం సభ్యుడు ఐవీఎస్ మనోహర్‌రావు పాల్గొన్నారు.

అలరించిన బృందావన భజన

తోట్లవల్లూరు: దేవరపల్లిలో శరన్నవరాత్రి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం రాత్రి ఏర్పాటు చేసిన బృందావన చెక్క భజన కార్యక్రమం గ్రామస్తులను అలరించింది.

మెరుగైన పాల ఉత్పత్తే ధ్యేయం

గుడ్లవల్లేరు: మెరుగైన పాల ఉత్పత్తే ధ్యేయంగా పాడి రైతులు కృషి చేయాలని ఉలవలపూడి సర్పంచ్ పామర్తి కన్య భాస్కరరావు పిలుపునిచ్చారు. ఆ గ్రామంలో పాల కేంద్రాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. గ్రామ కార్యదర్శి డి.భాగ్యరాజ్ పాల్గొన్నారు.

అన్నపూర్ణాదేవీ నమోస్తుతే



తోట్లవల్లూరులో శ్రీఅన్నపూర్ణాదేవిగా..



తటివర్రు రోడ్డులో లలితా త్రిపుర సుందరీదేవిగా..



గుడివాడలో లలితా త్రిపుర సుందరీ దేవిగా..



పామర్రు కన్యకాపరమేశ్వరికి కాశీ అన్నపూర్ణాదేవి అలంకారం

ఘనంగా దేవీ శరన్నవరాత్రులు

తోట్లవల్లూరు: దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా జరుగుతున్నాయి. తోట్లవల్లూరులోని శ్రీభ్రమరాంబ చెన్నమల్లికార్జునస్వామి ఆలయంలో అమ్మవారు శనివారం శ్రీఅన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు బాలాజీ, నాగుశర్మ అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈఓ హరి దుర్గానాగేశ్వరరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

లలితా త్రిపుర సుందరీ దేవిగా అమ్మవారు

గుడివాడ టౌన్: స్థానిక బంటుమిల్లి రోడ్‌లోని శ్రీ గంగాపార్వతీ సమేత శ్రీ భీమేశ్వర స్వామి దేవస్థానం(పెద్ద శివాలయం)లో అమ్మవారిని శనివారం లలితా త్రిపుర సుందరీదేవిగా, శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా, గౌరీశంకరపురంలోని గౌరీశంకరస్వామి దేవస్థానంలో అమ్మవారిని శ్రీ గజలక్ష్మీదేవిగా అలంకరించారు.

కాశీ అన్నపూర్ణాదేవిగా..

పామర్రు: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శనివారం అమ్మవారిని కాశీ అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. శ్రీ అంకమ్మతల్లి ఆలయంలో అమ్మవారిని సంతాన లక్ష్మిగా అలంకరించి పూజించారు. పర్వతవర్ధనీ దేవి ఆలయంలో అమ్మవారిని కాశీ అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. సోమేశ్వర స్వామి ఆలయంలోని పార్వతీ అమ్మవారిని మంగళగౌరిగా అలంకరించారు.

దత్తాశ్రమంలో కోటి కుంకుమార్చన

మండవల్లి: దసరా ఉత్సవాల్లో భాగంగా శనివారం దత్తాశ్రమంలో కోటి కుంకుమార్చన నిర్వహించారు. అన్నపూర్ణాదేవి అలంకరణలో ఉన్న అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. యాజ్ఞికులు ఈశ్వరశర్మ ఆధ్వర్యంలో శతచండీ యాగం కొనసాగుతోంది. ఉభయదాతలుగా హైద్రాబాద్‌కు చెందిన మారెళ్ల వెంకటసుబ్బారావు వ్యవహరించారు. ఆశ్రమ ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ ఉదయ్‌శంకర్ దంపతులు పూజలు నిర్వహించారు. వడుపు వెంకటేశ్వరరావు, భువనేశ్వరి దంపతులు దత్తాశ్రమానికి రూ.15 వేలు విలువ గల ఫ్యాన్లు బహూకరించారు.

తటివర్రురోడ్డులో..

గుడివాడరూరల్: తటివర్రురోడ్డులో ఏర్పాటు చేసిన ఉత్సవాల్లో అమ్మవారు శ్రీలలితాత్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. చిన ఎరుకపాడులో అష్టలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో అమ్మవారు గజలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు.

గాయత్రీదేవిగా కొండలమ్మ

గుడ్లవల్లేరు: వేమవరం శ్రీ కొండలమ్మ తల్లి అమ్మవారు గాయత్రీదేవిగా శనివారం దర్శనమిచ్చారు. ఆలయ ఈఓ ఆకుల కొండలరావు ఆధ్వర్యంలో ఆలయ పండితుల వేద మంత్రోచ్ఛరణ నడుమ విశేషాభిషేకాలతో పాటు ప్రత్యేక హోమాలను చేపట్టారు. ఉత్సవ కమిటీ సభ్యులు పెన్నేరు రమేష్, మోహనరావు, దేవేంద్ర పాల్గొన్నారు.

మండవల్లిలో..

మండవల్లి: మండవల్లి భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి ఆలయంలో శనివారం అమ్మవారు గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు. వల్లాని సుధీర్‌కుమార్ దంపతులు పీటల మీద కూర్చున్నారు. అర్చకులు గూడూరు నాగవెంకటశాస్త్రి భక్తులతో పూజలు జరిపించారు.



మండవల్లిలో పూజలు చేస్తున్న ఉదయ్‌శంకర్ దంపతులు

పెదపారుపూడిలో..

వెంట్రప్రగడ (పెదపారుపూడి): మండలంలోని వెంట్రప్రగడ నామేశ్వరస్వామి ఆలయంలో శ్రీ పార్వతి అమ్మవారు శనివారం గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు. ఉదయాన్నే మహిళలు అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: సింగరాయపాలెం శ్రీఅమతేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు లలితత్రిపురసుందరీ దేవీగా దర్శనమివ్వగా దేవపూడి విజయదుర్గాంబ, నారాయణపురం అంకమ్మ, పెదకామనపూడి రామలింగేశ్వరస్వామి, చినకామనపూడి మహంకాళేశ్వర స్వామి ఆలయాల్లో కాశీఅన్నపూర్ణాదేవీగా, మహాలక్ష్మీ దేవిగా దర్శనమిచ్చారు.

ధాన్యలక్ష్మీదేవీగా శ్యామలాంబ తల్లి

కైకలూరు: కైకలూరు శ్యామలాంబతల్లి ధనలక్ష్మీదేవీ అలంకరణలో శనివారం దర్శనమిచ్చారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా కోలాట ప్రదర్శన, హరికథగానం, రాత్రి సత్యహరిశ్చంద్ర పౌరాణిక నాటకం ఆకట్టుకున్నాయి. కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానంలో దేవీ శరన్నవరాత్రుల్లో అమ్మవారికి ఆవరణపూజ, లలిత సహస్రనామ కుంకుమార్చనను దొడ్డిపట్ల గ్రామానికి చెందిన గొట్టుముక్కల శివరామరాజు, శాంతిప్రియ దంపతులు చేశారు.



గాయత్రీ సుందరీ దేవిగా కొండలమ్మ



మండవల్లి మల్లేశ్వరస్వామి ఆలయంలో



సింగరాయపాలెంలో లలితాత్రిపురసుందరిగా..



ఆటపాకలో అన్నపూర్ణాదేవీగా..

సమన్వయంతో అభివృద్ధి చేద్దాం

ముదినేపల్లి రూరల్: అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధుల సమన్వయంతో మండలాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేద్దామని ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. నూతన ఎంపీడీఓ వై రామకృష్ణ శనివారం ఎంపీపీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

కొనసాగిన యోగా శిక్షణ

గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ సేవా భవన్‌లో యోగా శిక్షణా కార్యక్రమాన్ని శనివారం కూడా యోగా గురువు చినరాయుడు కొనసాగించారు. ఆ కార్యక్రమ ఆర్గనైజర్ వై.పి.సి.ప్రసాద్, లయన్స్ చైర్మన్ నిమ్మగడ్డ శశికళ, కార్యదర్శి ఎం.పెరుమాళ్లు, కోశాధికారి కల్యాణపు నవాబు, లయన్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇసుకను అక్రమంగా తరలిస్తున్న టిప్పర్ల స్వాధీనం

పమిడిముక్కల: ఐలూరు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు టిప్పర్లను మండల పరిధిలోని మేడూరు డొంకరోడ్డు వద్ద పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి తహసీల్దార్‌కు అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ శ్రీను మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణా చేసేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.